క్లుప్తంగా

రోడ్డుపై కూలిన వృక్షం



కిర్లంపూడి-రాజుపాలెం రోడ్డుపై స్తంభించిన వాహనాల రాకపోకలు

కిర్లంపూడి: మండలంలోని శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జగపతినగరం గ్రామపంచాయతీ పరిధిలో కిర్లంపూడి-రాజుపాలెం రహదారిపై ఓ భారీ వృక్షం కూలిపోయింది. దీంతో సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆదేశాలతో పంచాయితీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పొక్లెయిన్ సహాయంతో చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. సహాయక చర్యల్లో పోలీస్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని హెటిరో ఉద్యోగి మృతి

తుని రూరల్: తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం-గుల్లిపాడు స్టేషన్ల మధ్య రైలు ఢీకొనడంతో హెటిరో కంపెనీలో సేఫ్టీ ఫిట్టర్‌గా పని చేస్తున్న రెడ్డి సాయి మోహన్ (35) మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ జి.మోహన్‌రావు తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామానికి చెందిన సాయిమోహన్ శనివారం ఉదయం తన బంధువులు ఇంటికి దగ్గర మార్గం కవడంతో సీతంపాలెం వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఆరు నెలలు కిందట వివాహం కావడం, ఇంతలోనే ప్రమాదానికి గురికావడంతో ఉటుంబంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, తల్లి దండ్రులు ఉన్నారు. ఇన్‌చార్జ్ ఎస్సై పి.వాసు ఆదేశాలు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వివరించారు.

లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట పరిధి గోకవరం రోడ్డులో గల కోడూరి రంగారావు లైన్స్ జిల్లా కంటి హాస్పటల్ నందు శనివారం లయన్స్ క్లబ్ 108వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ కొత్త కొండబాబు, తదితరులు పాల్గొని లైన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మేలివ్‌న్ జోన్స్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు వి.డయానా, ఇన్‌చార్జ్ గంగరాజు, సురేష్, హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి



శృంగవరం నాయకులతో ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రౌతులపూడి మండలం శృంగవరం సర్పంచ్ పులుగు ఏసుబాబు, గాడి శ్రీను, జట్ల సత్యన్నారాయణ, మానేం వీరబాబు తదితరులు కిర్లంపూడిలోని మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు నియోకవర్గంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గేలుపే లక్ష్యంగా పనిచేయాలని, ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు.

విద్యార్థికి అండగా పోలీసులు



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థికి పెద్దాపురం పోలీసులు అండగా నిలిచారు. స్థానిక సత్తిరెడ్డిపేటకు చెందిన కర్రి యశ్వంత్ అనే బాలుడి స్థానిక బ్రీసీటీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే నానమ్మ అప్పలనర్సమ్మ దగ్గర ఉంటున్న తనకు 9వ తరగతిలో చదివించే స్తోమత లేదు. దీంతో పట్టణ యువత వంగలపూడి సతీష్ గతంలో అప్పటి పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి వద్దకు తీసుకువెళ్లి బాలుడి పరిస్థితి చెప్పడంతో ఆమె 8వ తరగతి అవసరమైన ఫీజును చెల్లించి బాలుడిని చదివించారు. ఆమె బదిలీ అనంతరం మళ్లీ ఆ కుటుంబం సతీష్‌ను ఆశ్రయించగా పెద్దాపురం ఎస్సై మౌనిక వద్దకు తీసుకువెళ్లి పరిస్థితిని వివరించారు. దీంతో ఆమె స్పందించి విద్యార్థి చదువకు అవసరమైన ఫీజు చెల్లించేందుకు హామీ ఇచ్చారు. ఇటువంటి సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన ఎస్సై మౌనికను పలువురు అభినందిస్తున్నారు.

ఎరువుల ఎంపికే కీలకం

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న
- పరిమిత ఎరువుల వినియోగంతో సత్ఫలితాలు
- మితిమీరిన ఎరువుల వాడకంతో ఆరోగ్యం, ఆదాయానికి నష్టం
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు



కోటనందూరులో తయారు చేసిన వరి నారుమడి

కోటనందూరు: రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యం కావాలంటే సాగులో ఎరువుల ఎంపికే కీలకంగా మారుతుంది. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేర వినియోగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు దిగుబడులు కూడా కోల్పోయే ప్రమాదముంది. ప్రధాన, కాంప్లెక్స్ ఎరువుల వినియోగంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకొని సాగులో పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే పశువుల పెంట (గెత్తం), పచ్చిరొట్ట, సేంద్రీయ ఎరువుల వాడకంతో భూమి సారవంతమై భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తుందని చెబుతున్నారు. ఖరీఫ్ పనులకు సిద్ధమవుతున్న రైతన్నలకు అధికారులు పలు కీలక సూచనలు పాటించాలంటున్నారు.

ఇదీ పరిస్థితి

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో 40 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేసే అవకాశం ఉంది. నైరుతి దూసుకొస్తున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. బోర్ల కింద ఇప్పటికే నారు మడులను సిద్ధం చేస్తుంటుండగా మరో 10 నుంచి 15 రోజుల్లో పనులు ఊపందుకునే అవకాశం కనిపిస్తుంది. వరిసాగులో యూరియా, డీఏపీతో పాటు పొటాష్‌ను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎకరం పొలానికి ఎరువులు ఈ విధంగా వినియోగించాలని వారు చెబుతున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం

ఎకరం పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు వేపుగా ఎదుగుతుంది. అలాగే మొదటి దమ్ములో మూడు బస్తాల సూపర్, బస్తా డిఏపీ, ఉడిచే ముందు 35 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ కలిపి వాడాలి. పొలం ఉడిచిన 45 రోజుల తరువాత 45 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ వేసుకోవాలి. పొట్ట దశలో మరో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వాడాలి. 60 రోజుల వ్యవధిలో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చొప్పున వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

పొటాష్ లోపంతో ప్రమాదం

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై పెద్దగా ఆశక్తి చూపడం లేదు. పొటాష్ లోపం కారణంగా గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని చెబుతున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

గెత్తం, పచ్చిరొట్టతో సారవంతం

పంట సాగు చేసే పొలంలో దమ్ము చేయడానికి 15 రోజుల ముందు పశువుల పెంట(గెత్తం), జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువులు వాడితే భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయి. వీటి వినియోగంతో భవిష్యత్‌లో కూడా భూమి సారం తగ్గిపోకుండా ఉంటుంది.

సేంద్రీయ ఎరువులు తయారు చేసుకోవాలి తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రీయ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుందని హెచ్చరిస్తున్నారు. కొద్దిగా కష్టమైనా తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేంద్రీయ ఎరువులను తయారు చేసుకొని వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చని చెబుతున్నారు.

వినియోగంపై అవగాహన అవసరం



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. రైతుసేవా కేంద్రాల్లో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు వస్తాయి. రైతుసేవా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సేంద్రీయ ఎరువుల వైపు రైతులు అడుగులేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: మండల పరిధి చిల్లంగిలో అష్టసమేత లక్ష్మీనారాయణ స్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠ, జీవ ధ్వజశిఖర మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక మంత్రోచ్ఛారణలతో గిరిబాబుకు ఆశీర్వచనం అందజేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం అప్పనపాలెం గ్రామ శివారుల్లో శనివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలో సారా స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు. తనిఖీల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, తదితర సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

దాడిశెట్టి రాజా పరామర్శ



రామచంద్రరావును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, నాయకులు

తుని రూరల్: మాతృ వియోగంతో బాధపడుతున్న కుమ్మరిలోవ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జక్కాన రామచంద్రరావును పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి రామచంద్రరావు మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు. తాండవ షుగర్స్ మాజీ అధ్యక్షుడు నాగం దొరబాబు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు , సకురు నాగేంద్ర నెహ్రూ, అన్నంరెడ్డి వీర్రాఘవులు, డొంక వెంకటబెనర్జి, చింతల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

త్యాగం, సమానత్వానికి ప్రతీక బక్రీద్



తుని పెద్ద మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తుని రూరల్: త్యాగానికి, సమానత్వానికి సంకేతం బక్రీద్ అని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పర్వదినాన్ని తుని నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని భక్తితో ఈద్-ఉజ్-జుహ (బక్రీద్) జరుపుకున్నారు. త్యాగానికి సిద్ధమైన సంఘటనను స్మరించుకుంటూ బక్రీద్ జరుపుకోన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు పోషకాహారం కిట్లను అందించారు. అందరూ సమానమే, ఆరోగ్యంగా ఉండాలి అనే మానవతా సందేశాన్ని ఇచ్చే పర్వదినమే బక్రీద్ పండగ అన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ

గోకవరం: ముస్లింలు పవిత్ర పండుగ బక్రీద్‌ని మండలంలోని శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గోకవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని జామియా మసీదు, పాత బస్టాండ్ సమీపంలోని జుమ్మా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా మసీదుల మత గురువులు త్యాగం ప్రాముఖ్య, బక్రీద్ రోజు దాన్ని ఎందుకు చేస్తారన్న విషయాలను ముస్లింలు బోధించారు. విశేష సంఖ్యలో ముస్లిం ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో బక్రీద్ ప్రార్థనలు



ఏలేశ్వరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఏలేశ్వరం: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకొనే బక్రీద్‌ను పండుగను పట్టణంలో శనివారం ముస్లిం మతస్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నర్సీపట్నం రోడ్డులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్‌ను త్యాగాల పండుగ అని పిలుస్తారన్నారు. అల్లాహ్‌కు అతిఇష్టమైన మహమ్మద్ రసూల్ ముత్తాత అయిన మహ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం ఖలీలుల్లా అల్లాహ్ సందేశం మేరకు చేసిన త్యాగానికి ఈ పండగను జరుపుతామన్నారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ముద్రగడ ఓ బ్రాండ్



బెహరా రాజరాజేశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు: ముద్రగడ అంటేనే రాష్ట్రంలో ఒక బ్రాండ్..అటువంటి నాయకుని కుమార్తెవైన నీవు రాజకీయాల కోసం ఇంతగా దిగజారుడుతనం అవసరమా..అని బార్లపూడి కాంతిని పూర్వ తూర్పు గోదావరి జిల్లా జడ్పీటీసీల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, ప్రత్తిపాడు జడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి సూటిగా ప్రశ్నించారు. ముద్రగడ కుమార్తెగానే మీకు గుర్తింపు..మీ అత్త వారు బార్లపూడి వారు ఏనాడైనా రాజకీయాలలో, ప్రజల్లో ఉన్నారా? మీ మామగారు ముద్రగడ పద్మనాభం గారి అల్లుడంటేనే గుర్తింపు అన్న విషయం మీకు తెలియనిదికాదన్నారు. రాజకీయంగా మిమ్మలని కొందరు ముద్రగడపైకి ఉసికొల్పుతున్నారన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు ముద్రగడ కుటుంబాన్ని ఆదరిస్తూనే ఉన్నారు..ఉంటారు. ఈ విషయం మీ సోదరుడు గిరిబాబు గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంలో వస్తున్న ప్రజాదరణ చూస్తేనే అర్థమవుతోందని చెప్పారు. ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడిన పోరాట యోధుడని ఆమె కొనియాడారు. ఆయన నాయకత్వంలో ముద్రగడ గిరిబాబును రాబోయో రోజుల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి, శాశనసభకు పంపుతామన్నారు. పదవుల కోసం ముద్రగడపై దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని బార్లపూడి కాంతికి జడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి హితవు పలికారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై సతీష్

కిర్లంపూడి: సైబర్ నేరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని సోమవరం గ్రామంలో కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, హెల్మెంట్ ధారణపై ప్రజలకు శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాపర్టీ నేరాలు, శక్తియాప్, డ్రగ్స్ వద్దు బ్రో, సీసీటీవీ కెమెరాలు, జూద క్రీడలు, బెట్టింగ్ యాప్‌ల నివారణపై వైఆర్‌కే శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



వైభవంగా జరుగుతున్న స్వామి అమ్మవార్ల కల్యాణం

ఏలేశ్వరం: శ్రీ అనంతలక్ష్మీ సమేత శ్రీ సత్యనారాయణస్వామి వారి పాంచాహ్నిక వార్షిక దివ్యకల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం స్వామి అమ్మవార్ల వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ఏలేరు నది ఒడ్డున ఉన్న శ్రీ సత్య నారాయణ స్వామి వారి ఆలయంలో అర్చకుడు పొన్నూరు సత్యనారాయణ చార్యులు నేతృత్వంలో స్వామి అమ్మవార్ల కల్యాణం ఘనంగా జరిపించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృత్యు టిప్పర్లు..!



శంఖవరం కొత్తుంవారి వీధిలో రోడ్డులో నిలిచిపోయిన లారీలు

శంఖవరం: రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా కత్తిపూడి వెళ్లే లారీ శుక్రవారం రాత్రి టైర్లు ఊడి పడటంతో తృటిలో ప్రమాదం తప్పింది. అన్నవరం పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం రౌతులపూడి మండలం చల్లూరు నుంచి ఎర్రమట్టి (లేటరైట్), క్రషర్‌ల నుంచి పెద్ద రాళ్లలో ప్రతి రోజులగానే అధిక సంఖ్యలో లారీలు(టిప్పర్) ఎగుమతుల చేస్తున్నారు. ఓ భారీ టిప్పర్ అధిక లోడు ఎర్రమట్టితో వస్తుండగా ఒక్కసారిగా శంఖవరం కొత్తుంవారి వీధి సమీపంలో వెనకాల టైర్లు ఊడి పక్కనే నిలిచి పోయింది. దీంతో మరో భారీ వాహనాలు ఆగి ఉన్న లారీ రోడ్డు పక్క నుంచి ప్రయాణం చేయడంతో రోడ్డు బీటలు వారి ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులు అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోయారు. దీనిపై తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ ఇంచార్జిల నియమకం



ఇన్‌చార్జిలను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

తుని రూరల్: తుని నియోజకవర్గం, మండలాలవారీగా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్‌లను జిల్లా నాయకులు నియమించారు. శనివారం తుని పట్టణం కొండవారపేటలో జిల్లా ఇన్‌చార్జ్‌లు సూర్యపాక వాసుదేవరావు, పసుపులేటి చిన్నబాబు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. నియోజకవర్గ ఇంచార్జ్‌గా ముప్పిడి శ్యాంకుమార్, కో-ఇంచార్జ్‌లుగా ఆరుగుల సత్తిబాబు, పెదపూడి ఏసుబాబు, కింతాడ సత్తిబాబు నియమితులయ్యారు. తుని మండలానికి చీలు ప్రసాద్, గంధం మహేష్, పెదపూడి శివ, తుమ్మలపల్లి కుమార్, తొండంగి మండలానికి కందవల్లి అశోక్, ఉలవపాటి సామ్యూల్, కోటనందూరు మండలానికి లంక నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్‌లు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని భారీ ఎత్తున ఘనంగా నిర్వహించాలని నూతనంగా ఎన్నికైన ఇంచార్జ్‌లకు సూచించారు. అనంతరం జిల్లా ఇంచార్జ్‌లను ఘనంగా సత్కరించారు.

మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న వ్యాన్



నీలాద్రిరావుపేటలో ప్రమాదానికి కారణమైన ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన వ్యాన్



జగ్గంపేట బ్రిడ్జ్ శివారులో 108 అంబులెన్స్‌లో దిగుతున్న ప్రయాణికులు

గండేపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని ఆ రెండు కుటుంబాలు ద్విచక్ర వాహనంపై దైవ దర్శనానికి వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా తీవ్ర గాయాలపాలై కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన అల్లు కృష్ణ, గొంప రాజు ఊక లారీపై కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిద్దరు శనివారం ఉదయం పెద్దాపురం మండలం చిన తిరుపతి దైవ దర్శనానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా గ్రామ శివారుకు వచ్చే సరికి గుంటూరు నుంచి విశాఖ వెళ్తున్న శ్రీ రవి రాజ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన వ్యాన్ ఢీకొట్టింది. నిశ్చితార్థం వేడుకలకు సుమారు 10 మంది ప్రయాణీకులతో గుంటూరు వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టి, రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను తాకుతూ ఖాళీ ప్రదేశంలో ఉన్న రాళ్లను ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో కృష్ణ, రాజు తీవ్రంగా గాయపడటంతో హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం కాకినాడ తరలించినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిదని, వ్యాన్ నిలిచిన సమీపంలో గొయ్యి ఉందని వ్యాన్ ఆ గోతిలో పడితే ప్రమాదం మరింత తీవ్రంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.

108 అంబులెన్స్ నిర్వాకం

ప్రమాదానికి కారణమైన శ్రీ రవి రాజ ప్రైవేటు ట్రావెల్స్ వ్యాన్‌లో ఉన్న ప్రయాణికులను 108 అంబులెన్స్‌లో జగ్గంపేట డ్రాప్ చేయడం చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ ప్రయాణికులు విశాఖ వెళ్లాల్సి ఉండగా జగ్గంపేట బ్రిడ్జికి శివారులో అటుగా బస్సులు వెళ్లే ప్రదేశంలో వారిని దింపడంతో అక్కడి చూపరులు ఆశ్చర్యచకితలవడం వారి వంతయ్యింది. ప్రమాదంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాల్సిన 108 అంబులెన్స్ ప్రైవేటు పనులకు ఉపయోగిస్తారా అని పలువురు చర్చించుకుంటున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సమావేశంలో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: వాహనాల నడపడంలో రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రామకృష్ణ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక చెరకు కాటా వద్ద శనివారం ట్రాక్టర్లు, ఆటో డ్రైవర్లు, యజమానులకు రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు గాయపడినవారు పరిహారం పొందాలంటే వాహనం ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకూడదన్నారు. మైనర్లకు వాహనాలిస్తే ప్రమాదం జరిగినప్పుడు సదరు వాహన యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు.

మెదడు సంకేతాలను అశ్రద్ధ చేయొద్దు

కాకినాడ రూరల్: మెదడు ఇచ్చే సంకేతాలపై అశ్రద్ధ వద్దని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ చందు లింగోలు తెలియజేశారు. ఆదివారం ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. మనం పని ఒత్తిడిగాను, కళ్లు తిరగడాన్ని అలసటగా తేలిగ్గా తీసుకుంటామని, ఒక్కోసారి సాధారణ సంకేతాలే మన మెదడులోని తీవ్రమైన సమస్యకు కారణం కావచ్చని డాక్టరు చందు పేర్కొన్నారు. ఇవి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా రావచ్చన్నారు. సరైన సమయంలో గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదన్నారు.